# సాక్షి ప్రకాశం

శనివారం | 4 | ఫిబ్రవరి | 2023






## ఒంగోలును తాకిన స్వాతికిరణం

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు ఒంగోలుతో ఎనలేని అనుబంధం ఉంది. ఆయన మూడు సార్లు జిల్లాకు వచ్చారు.

- 8లో..



## విదేశీ విద్యకు ప్రభుత్వ దీవెన

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30 /21

## వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

## న్యూస్‌రీల్

### భారతీయ సంస్కృతికి విశ్వనాథ్ నిలువుటద్దం

**ఒంగోలు టౌన్:** ప్రసిద్ధ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతి పట్ల ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి నివాళి అర్పించారు. విశ్వనాథ్ మరణం తీవ్ర విచారాన్ని కలగజేసిందని శుక్రవారం సామాజిక మాధ్యమంలో ఒక సందేశాన్ని పోస్టు చేశారు. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సినిమాలు తెలుగు సినీ రంగానికి అసమాన గౌరవాన్ని తెచ్చాయన్నారు. భారతీయ సంస్కృతికి విశ్వనాథ్ నిలువుటద్దం అని, తెలుగువారి గుండెల్లో కళాతపస్విగా శాశ్వతంగా నిలిచిపోతారని కొనియాడారు.

**కళాతపస్వి విశ్వనాథ్ మృతి తీరని లోటు**

**యర్రగొండపాలెం:** కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతి తెలుగు చలన చిత్ర పరిశ్రమతోపాటు తెలుగు జాతికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. విశ్వనాథ్ మృతికి మంత్రి సంతాపం తెలియచేస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

### నేడు శివపార్వతుల కల్యాణం

**యర్రగొండపాలెం:** శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక భారతీయ స్టేట్‌బ్యాంకు వీధిలో శివపార్వతుల కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కె.పి.నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబు, శ్రీశైల దేవస్థానం ఈవో లవన్న పాల్గొంటారని ఆయన తెలిపారు.

### రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

**ఒంగోలు:** నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఈనెల 5న జిల్లాలోని 15 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3387 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుండగా ఒంగోలులో 5, కనిగిరి 3, మార్కాపురంలో 7 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష రుసుము చెల్లించి హాల్‌టికెట్లు జారీకాని విద్యార్థులు ఒకరోజు ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలన్నారు. పరీక్ష సమయానికి ఒక నిముషం ఆలస్యమైనా అనుమతించరన్నారు. పరీక్ష కేంద్రంలోకి గడియారాలు, ఏదైనా ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు అనుమతించరన్నారు. ఈ పరీక్షలకు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో తెలిపారు.

### నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

**దొనకొండ:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వి.రుషిత, 9వ తరగతి చదువుతున్న ఏసోబు నేషనల్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు సమక్షంలో అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. వీరిని అబ్జర్వర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు రామాంజనేయులు, పీఈటీ నరసింహారావు తెలిపారు.

### బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా మహేష్



బీఎస్ఐ నూతన కార్యవర్గం

**ఒంగోలు టౌన్:** బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడిగా ఇ.మహేష్, కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా వై.సిద్ధార్థలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రపంచానికి శాంతిని అందించడం ఒక్క బౌద్ధం వల్లే సాధ్యమతుందని రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేకే బోధి, ఈసీ సభ్యులు ఇ.నాగేశ్వరరావు, పుల్లయ్య బోధి, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

---

పెద్ద పులుల సంచారంతో నల్లమల సమీప గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. రెండు వారాలుగా ఇవి జనారణ్యంలోకి వస్తుండడంతో ప్రజలు కంటిమీద కునుకులేకుండా భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటి వరకూ వీటి దాడిలో మూగ జీవాలు బలయ్యాయి. అవి తమపై ఎక్కడ దాడిచేస్తాయోనని ప్రజలు హడలిపోతున్నారు. నీటి కోసం ఇవి అడవి నుంచి బయటకు వస్తున్నాయని తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు సేకరిస్తున్న పాదముద్రల ఆధారంగా పులులు బయటకు వస్తున్నాయని స్పష్టమవుతోంది.



అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి (ట్రాప్ కెమెరాలో దృశ్యం)

# బాబోయ్ పులి..

- 15 రోజులుగా నల్లమల సరిహద్దు గ్రామాల్లో పులుల సంచారం
- వణుకుతున్న ప్రజలు
- తరచూ దాడుల్లో మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నీటి కోసం బయటకు వస్తున్నాయంటున్న గ్రామస్తులు
- అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు పెంచాలని అధికారులకు వినతి

**పెద్దదోర్నాల:** గిద్దలూరు, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో పెద్ద పులుల సంచారంతో సరిహద్దు గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. గిద్దలూరు అటవీ డివిజన్ పరిధి మాగుటూరు, లక్ష్మీపురం, వెలగలపాయ, శంకరాపురం, కాకర్ల తదితర గ్రామాల పరిధిలోనూ, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామం పరిధిలో పులి సంచరించినట్టు అధికారులు గుర్తించారు. గత నెల చివరి వారంలో అర్ధవీడు మండల పరిధిలోని మాగుటూరులో పెద్ద పులులు దాడులు చేయడంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. వెలగలపాయ కొండ సమీపంలో ఎద్దులను మేతకు తీసుకెళ్లగా ఓ ఎద్దుపై పెద్దపులి దాడి చేస్తున్న సమయంలో చూసిన రైతు కంపిలి బాలేశ్వరరావు కేకలు వేయడంతో పులి పారిపోయింది. నాలుగు రోజుల వ్యవధిలో పెద్దపులి రెండుసార్లు పశువులపై దాడికి పాల్పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపంలోని చెరువు వద్ద కొద్ది రోజులుగా పెద్దపులి సంచరించినట్టు అధికారులు గుర్తించారు. పులుల సంచారాన్ని గుర్తించేందుకు అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. పెద్దపులి దాడిచేసిన ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటుండటం కెమెరాలో నిక్షిప్తమైంది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై మాగుటూరు పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి కోసమే ఇవి బయటకు వస్తున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పులులు సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక బీట్‌లు ఏర్పాటు చేస్తామని అధికారులు గ్రామస్తులకు చెబుతున్నారు.

**నీటి లభ్యత అంతంతే..**

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చిన్నపాటి చెక్‌డ్యాంలు, నీటి తొట్టెలు, కుంటలు, సాసర్ పిట్స్‌లను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్వహణ కోసం వేసవికాలంలో మొబైల్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి. అయితే ప్రస్తుతం చెక్‌డ్యాంలు, సాసర్ పిట్లలో నీరులేక పోవటంతోపాటు చాలా ప్రాంతాల్లో చెరువులు, నీటి కుంటల్లో నీరు లేక అవి చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు నల్లమలలో భూగర్భ జలాలు అడుగంటడం, నీళ్లు దొరక్క పోవటంతో వన్యప్రాణులు దాహాన్ని తట్టుకోలేక సమీప గ్రామాలకు వస్తున్నాయి. ఈక్రమంలో అవి జనావాసాల మధ్య సంచరించే సమయంలో వన్యప్రాణులు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి.



శుక్రవారం అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

**జనావాసాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలి:**

వన్యప్రాణులను జనావాసాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని పలు సరిహద్దు గ్రామాల ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు. గిద్దలూరు డివిజన్ పరిధిలో గిద్దలూరు, తురిమెళ్ల, గుండ్లకమ్మ రేంజిలు, మార్కాపురం డివిజన్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, కొర్రప్రోలు, నెక్కంటి, గంజివారిపల్లి, విజయపురి సౌత్ రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజిల పరిధిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సుమారు 400 సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో రెండు వారాల్లో వాటిల్లో నీటితో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈలోగా సాసర్ పిట్లు నింపితే వన్యప్రాణులు జనావాసాల వైపు రాకుండా ఉంటాయని పలువురు పర్యావరణ పరిరక్షణ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రేంజ్‌ల వారీగా పెద్దపులులు, చిరుత పులుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి నిల్వలను పెంచాల్సిన అవసరముందని వారు పేర్కొంటున్నారు.

**రైతుపైనా దాడి..**

ఇటీవల నల్లమల అభయారణ్యంలోని పాలుట్లలో తన పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతు బాలునాయక్‌పై పెద్దపులి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఈ సంఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని ఇసుర్రాయిగుట్ట వద్ద చోటు చేసుకుంది. దీని ప్రభావంతో ఆ ప్రాంతంలోనూ కలకలం రేగింది. గతంలో పెద్దపులులు మనుషుల మీద దాడి చేసిన సంఘటనలు ఎక్కడా చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో పాలుట్ల పరిసర ప్రాంతాలు సైతం పులి సంచారంతో హడలిపోతున్నాయి. అలాగే మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం గండి చెరువు ప్రాంతంలో ఓ రైతుకు సంబంధించిన ఎద్దును పులి హతమార్చింది. ఇలా వరుస సంఘటనలు ఆయా ప్రాంతాల్లోని రైతుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నీటి లభ్యత సరిగా లేకపోవడంతో ఇవి జనావాలకు వస్తున్నాయని, ప్రజలపై, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మాగుటూరు అటవీ ప్రాంతంలో ఎద్దు కళేబరాన్ని తింటున్న పెద్దపులి (ట్రాప్ కెమెరాలోని దృశ్యం)

**పులుల సంచారం పెరిగింది**

ప్రస్తుతం నల్లమలలో పులుల సంచారం పెరిగింది. నాగార్జునసాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యంలో గతంలో కంటే ఇప్పుడు 73 వరకు పెద్దపులులు సంచరిస్తున్నాయి. అర్ధవీడు, కొలుకుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటి నుంచో పులుల సంచారం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం పెద్దపులులు చెరువులు, కుంటల వద్దకు రావటం సహజంగానే జరుగుతుంది.

– విఘ్నేష్ అప్పావ్, ఫీల్డ్ డైరెక్టర్, మార్కాపురం

---

# అన్నా మీ మేలు మరువలేము..



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు టి.అంజయ్య తదితరులను పార్టీ కండువా వేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

- అడగకుండానే అన్నీ అందిస్తున్నారు
- గడప గడపలో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- బాలినేని సమక్షంలో పెద్ద ఎత్తున పార్టీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**ఒంగోలు:** ''అన్నా మీ మేలు మరువలేము, అడగకుండానే అన్నీ ఇస్తున్నారు. ఇంతకంటే మాకేం కావాలి..తప్పకుండా వచ్చే ఎన్నికల్లో మీ వెంటే ఉంటామంటూ'' ప్రజలు స్పష్టం చేశారు. స్థానిక విజయ్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, వడ్డెపాలెం కొండలు ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ పరంగా అందిన కార్యక్రమాలను వివరించారు. పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ఇళ్ల పట్టాల గురించి అడగ్గా మార్చినెలలో ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తిచేస్తామని వివరించారు. జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి పథకం అందుతున్న చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు బాలినేని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బాలినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తమ్మిశెట్టి అంజయ్య, తమ్మిశెట్టి వాసు, బండారు ఏడుకొండలు, తమ్మిశెట్టి శ్రీను, బండారు దుర్గయ్య, బండారు వెంకటేశ్వర్లు, బండారు డేవిడ్, బండారు శ్రీను, బండారు అంకమ్మ, గుంజి శివదుర్గ, మక్కిల దుర్గ , శ్రీను, వల్లపు ఆనంద్, గుంజి భరత్, బండారు శివ, బండారు గణేష్, బండారు అంజయ్య, బండారు రమేష్, బండారు ఆంజనేయులు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బాలినేనితోపాటు ఎస్ఎస్‌పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కటారి శంకర్, రాష్ట్ర కార్యదర్శి గోలి తిరుపతిరావు, మోడుబోయిన సురేష్ యాదవ్, సంయుక్త కార్యదర్శి పటాపంజుల శ్రీనివాసులు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గంటా రామానాయుడు, ట్రేడ్ యూనియన్ జిల్లా, నగర అధ్యక్షుడు కేవీ ప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు మీరావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులుగు అక్కిరెడ్డి, పటాపంజుల అశోక్, బడుగు ఇందిర, పోకల అనూరాధ, తమ్మినేని మాధవి, దాసరి కరుణాకర్, వల్లెపు మురళి, జాజుల కృష్ణ, నగర పాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మరువలేని వ్యక్తి కళాతపస్వి



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు అర్బన్:** కళామతల్లి ముద్దుబిడ్డ కళాతపస్వి కే విశ్వనాథ్ మరణం తెలుగు లోకానికి తీరని లోటని, తెలుగు వ్యక్తులు ఎవరూ మరువలేని వ్యక్తి అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక లాయర్‌పేట రైతు బజార్ సెంటర్‌లో శుక్రవారం గాయత్రి సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో కే విశ్వనాథ్‌కు నివాళులర్పించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి బాలినేని హాజరై విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1965లో ఆత్మగౌరవం సినిమాతో డైరెక్టర్‌గా మారి తెలుగు సంస్కృతి, సంగీత, సాహిత్యాలకు ప్రాధాన్యం ఇస్తూ కళాఖండాలను రూపొందించిన మహనీయుడని కీర్తించారు. నంది అవార్డులతో పాటు జాతీయ పురస్కారాలు, పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. విలువలు, సంస్కృతితో కళాఖండాలను కమర్షియల్‌గా కూడా నిర్మాతలకు లాభం చేకూరేలా సినిమాలు తీయడం ఆయనకు మాత్రమే సొంతమన్నారు. ఎంతోమంది దిగ్గజాలుగా ఉన్న గేయ రచయితలు, నటులను పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో మైనంపాటి సాయి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, వృద్ధాశ్రమం అధ్యక్షుడు అగస్త్యరాజు, శివయ్య, ఉప్పుగుండూరి శ్రీనివాసరావు, శాండిల్య, నీలంరాజు రాఘవ, గడియారం సుబ్బయ్యశర్మ, దామరాజు క్రాంతికుమార్, తోటపల్లి సోమశేకర్, కటారి శంకర్, గంటా రామానాయుడు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

---

## డీఈడీ ఫస్టియర్ ఫెయిలైన విద్యార్థులకు పరీక్షలు

**ఒంగోలు:** 2015–17 బ్యాచ్ మొదలు 2018–20 బ్యాచ్ వరకు డీఈడీ మొదటి సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు ఏప్రిల్/మే నెలలో పరీక్షలు నిర్వహిస్తారని డీఈవో బి.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 4 నుంచి 6 సబ్జక్టులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 15వ తేదీలోగా రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 3 సబ్జక్టులకు రూ.140, రెండు సబ్జక్టులకు రూ.120, ఒక సబ్జక్టుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈనెల 28వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని డీఈవో తెలిపారు.

---

# ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్

SAKSHI DIGITAL MEDIA GROUP | SAKSHI PREMIER LEAGUE | Regional sponsor: APMDC, APMDC FOUNDATION



తలపడుతున్న పేస్ ఇంజనీరింగ్ కాలేజ, రైజ్ ఇంజనీరింగ్ కాలేజ జట్లు

- మూడోరోజు 38 బౌండరీలు, 12 సిక్సర్లతో క్రీడాభిమానులకు కనువిందు
- సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన పేస్, ట్రిపుల్ ఐటీ జట్లు
- ఈనెల 7వ తేదీ జిల్లా స్థాయి పోటీలు ముగింపు

**ఒంగోలు:** సాక్షి ప్రీమియర్ లీగ్ స్థానిక సామర్థ్యాల వెలికితీతకు వేదికగా నిలిచింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని క్రీడాకారులు తమ శక్తిసామర్థ్యాలను చాటారు. కేవలం 26 బంతుల్లోనే పేస్ ఇంజినీరింగ్ కాలేజీ క్రీడాకారుడు సుదర్శన్ అర్ధ శతకం పూర్తిచేసి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకంగా వ్యవహరించాడు. మొత్తంగా 38 బౌండరీలు, 12 సిక్సర్లతో స్థానిక మినీ స్టేడియంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రీడాభిమానులకు కనువిందు చేసింది.

**తొలి సెమీఫైనల్ విజేత పేస్:**

క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీతో రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు తలపడింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి రైజ్ కాలేజీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 46 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం బరిలోకి దిగిన రైజ్ కాలేజీ జట్టు కేవలం 6 ఓవర్లలోనే 50 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. రైజ్ కాలేజీ క్రీడాకారుడు పవన్ కళ్యాణ్ 4 బౌండరీలు, రెండు సిక్సర్లతో 16 బంతుల్లో 31 పరుగులు చేసి అద్భుత విజయాన్ని జట్టుకు అందించాడు. దీంతో రైజ్ కాలేజీ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టుతో తలపడింది. ఇక్కడ కూడా టాస్ గెలిచిన రైజ్ కాలేజీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన పేస్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. సుదర్శన్ అనే క్రీడాకారుడు 26 బంతుల్లో 5 బౌండరీలు, మూడు సిక్సర్లతో 50 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్‌లో తొలి అర్ధశతకం సాధించిన క్రీడాకారుడిగా సుదర్శన్ నిలిచారు. అనంతరం బరిలోకి దిగిన రైజ్ కాలేజీ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్లు కోల్పోయి 83 పరుగులు మాత్రమే చేసింది. ఇంద్ర అనే క్రీడాకారుడు 30 బంతుల్లో 42 పరుగులు చేసినప్పటికీ జట్టును విజయతీరానికి చేర్చలేకపోయాడు. దీంతో 15 పరుగుల ఆధిక్యంతో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

**రెండో సెమీఫైనల్ విజేత ట్రిపుల్ ఐటీ కాలేజీ:**

రెండో సెమీస్ పోరు ట్రిపుల్ ఐటీ, క్విస్ 2 జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ట్రిపుల్ ఐటీ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. ఉదయ్ కిరణ్ అనే క్రీడాకారుడు రెండు సిక్సర్లు, 4 బౌండరీలతో 26 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. అనంతరం బరిలోకి దిగిన క్విస్ 2 జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. చందు ఒక్కడే 14 బంతుల్లో 18 పరుగులు చేసి కొంత ఫర్వాలేదనిపించాడు. దీంతో ట్రిపుల్ ఐటీ జట్టు 35 పరుగుల ఆధిక్యంతో విజేతగా నిలిచి ఫైనల్లోకి అడుగుపెట్టింది.

**7వ తేదీ ఫైనల్స్:**

సాక్షి ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు ఈనెల 7వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే జూనియర్స్ విభాగంలో పేస్ డిప్లొమా జట్టు ఫైనల్‌లోకి ప్రవేశించగా, రెండో ఫైనల్ జట్టు ఈనెల 7న ప్రకాశం డిప్లొమా–చీరాల డిప్లొమా జట్ల మధ్య జరిగే పోరులో విజేతతో తలపడనుంది. సీనియర్స్ విభాగంలో ఫైనల్ పోటీ పేస్–ట్రిపుల్ ఐటీ జట్ల మధ్య నిర్వహిస్తారు.



విజయం సాధించిన పేస్ ఇంజనీరింగ్ కాలేజ జట్టు



రైజ్ ఇంజనీరింగ్ కాలేజ ఒంగోలు జట్టు



విజయం సాధించిన ట్రిపుల్ ఐటీ కాలేజ జట్టు

### 7వతేదీ జరిగే మ్యాచ్‌లు:

**జూనియర్స్:**
ప్రకాశం డిప్లొమా–చీరాల డిప్లొమా
సెమీ ఫైనల్

**జూనియర్స్ ఫైనల్:**
పేస్ డిప్లొమా– ప్రకాశం డిప్లొమా, చీరాల డిప్లొమా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో విజేత

**సీనియర్స్ ఫైనల్:** పేస్–ట్రిపుల్ ఐటీ

## క్లుప్తంగా

### ఇద్దరు ఆర్ఎస్ఐలకు అటాచ్‌మెంట్

ఒంగోలు టౌన్: జిల్లా పరిధిలో ఇద్దరు ఆర్ఎస్ఐలకు అటాచ్‌మెంట్ ఇస్తూ ఎస్పీ మలికా గర్గ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు ఎస్ఈబీలో విధులు నిర్వహిస్తున్న యం. సునిల్ బాబును డీఏఆర్‌కు అటాచ్ చేశారు. డీఏఆర్‌లో ఉన్న ఎన్వీ శివప్రసాద్‌ను ఎస్ఈబీకి అటాచ్ చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

### కమర్షియల్ ట్యాక్స్ జేసీకి అభినందనలు



జేసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

ఒంగోలు టౌన్: కమర్షియల్ ట్యాక్స్ నెల్లూరు జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డిని కమర్షియల్ ట్యాక్స్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పైనం మల్లికార్జునరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపి.. 2023 డైరీ అందజేశారు. ఒంగోలు-1 క్యాంపు కార్యాలయంలోఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలపై సమీక్షించారు. సహాయ కమిషనర్ దుంపా ఝాన్సీ, బాల ప్రసన్న, దాసరి నరసింహారావు, ప్రత్యూష, పాముల అంజయ్య, దారా సుధాకర్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించి ఆ దిశగా ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి. విజయ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు జిల్లాల రీజినల్ స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రకృతి వ్యవసాయంలో 2027వరకు ప్రణాళిక, మోడల్ మండలాలు, మోడల్ గ్రామ పంచాయతీలు, బయో విలేజ్‌ల ఏపీఎం షాప్స్‌పై చర్చించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికలపై ఆరా తీశారు. తొలుత జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి. విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలోని వ్యవసాయ రంగంపై చర్చించారు. అనంతరం కలెక్టర్ సమావేశం హాలులో సమావేశం నిర్వహించారు. అధికారులు రామరావు, కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, మురళీధర్, గోపిచంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### దొనకొండ కేజీబీవీ బాలికలకు అస్వస్థత



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీత

దొనకొండ: స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా.. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు పాఠశాల వద్దకు రావటంతో వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యాయ సిబ్బంది గోప్యంగా ఉంచి గురువారం అర్ధరాత్రి 16 మంది బాలికలను మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలికలకు దగ్గు, జలుబు ఉండటంతో మిరియాలు, పసుపు కలిపి పాలు ఇచ్చారు. తాగిన కొంచెం సేపటికి 16 మందికి వాంతులు కావటం, నీరసంగా పడిపోయారు. ఫుడ్ పాయిజన్ వలన బాలికలు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. జనవరి 24న సుప్రియ అనే బాలిక అస్వస్థతకు గురి కావటంతో తల్లిదండ్రులు మంగళగిరి ఎస్ఆర్ఐలో చేరిృంచారు. పరిస్థితి సరిగా లేదని తల్లిదండ్రుల సమాచారం. అలాగే రిపబ్లిక్ డే సందర్భంగా జెండా వందనం కార్యక్రమానికి కేజీబీవీ బాలికలు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయానికి జెండా వందనం చేసే సమయంలో నలుగురు బాలికలు వాంతులు చేసుకుని నీరసంగా పడిపోయారు. జిల్లా అధికారులు స్పందించి బాలికల ఆరోగ్యాలు కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా వైద్యాధికారి యం.సునీత తమ సిబ్బందితో కేజీబీవీ పాఠశాలను సందర్శించి బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ బాలికలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

### రాష్ట్ర స్థాయి పశుప్రదర్శన రేపు


పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో శ్రీ దుర్గా సమేత భోగేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయి న్యూకెటగిరీ సైజు పశుప్రదర్శన ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని గ్రామ ప్రజలు శుక్రవారం తెలిపారు. రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు వరుస బహుమతులను విజేతలకు అందజేస్తారని, వివరాలకు ఫోన్ 9989739884, 9492813226 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పాపం పుణ్యం తెలియని ఓ అమాయకుడు నాటి మూఢ నమ్మకాలకు బలవుతున్న ఓ వితంతువు మెడలో తాళి కడతాడు. అదీ సీతారాముల కల్యాణోత్సవంలో, రాముల వారు కట్టాల్సిన తాళిని. ఈ ఒక్క సీన్ స్వాతిముత్యం కథలోని ఆత్మని ఘాడంగా ఎలివేట్ చేస్తుంది..

• • •

తాను సంగీత సామ్రాట్‌ని అని విర్రవీగే గురువు ఆత్మాభిమానాన్ని గౌరవించేందుకు పదేళ్ల బాలుడు ఆత్మత్యాగం చేస్తాడు. స్వాతికిరణం అనే మహాకావ్యంలో పేద తల్లిదండ్రులు.. గురువు భార్య పడే ఆవేదన ప్రేక్షకుల గుండెల్ని పిండి చేసి.. కన్నీటి ధారలు కారుస్తుంది.. ఒకటా రెండా ఇలాంటి సున్నితమైన అంశాలతో కళాఖండాలు సృష్టించిన కళా తపస్వి భౌతికంగా దూరమైనా.. ఎప్పటికీ సినీ వినీలాకాశంలో ధ్రువతారగా మెరుస్తూనే ఉంటారు. సినీ దర్శకుడు కె. విశ్వనాథ్‌కు ఒంగోలుతో ఎనలేని బంధం ఉంది.

# ఒంగోలును తాకిన 'స్వాతి కిరణం'



- నగరంతో కళాతపస్వికి అనుబంధం
- మూడు సార్లు ఇక్కడకు వచ్చిన కె. విశ్వనాథ్

ఒంగోలు టౌన్: తెలుగు సినీ రుచిని ప్రపంచానికి చూపించిన కళాతపస్వి కె. విశ్వనాథ్ మృతితో ఒంగోలులోని ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. అయితే ఆ మహా రుషి ఒంగోలులో పర్యటించడం విశేషం. ఈ నేపథ్యంలో ఆయనతో తమకున్న పరిచయాన్ని, అనుబంధాన్ని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. నలభై సంత్సరాల క్రితం 1980 ఫిబ్రవరి 2న ఆయన దర్శకత్వంలో వచ్చిన శంకరాభరణం సినిమా ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఆ సినిమా విడుదలైన రోజునే ఆయన నిష్క్రమించడం కాకతాళీయం. కాగా నాడు శంకరాభరణం సినిమా విడుదలైన సందర్భంగా నటీనటులతో కలిసి విశ్వనాథ్ తొలిసారిగా ఒంగోలు వచ్చారు. పాతికేళ్ల తరువాత 2015 జూలై 4న ఒంగోలులోని శ్రీ నళిని ప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు హోటల్ సరోవర్‌లో వసతి సౌకర్యం కల్పించారు. కానీ ఎంతో నిష్టగా ఉండే ఆయన హోటల్ భోజనం తినేందుకు ఇష్టపడలేదు. అన్నవరప్పాడులోని పోతురాజు కాలనీలో నివాసం ఉండే నృత్య కళాశాల నిర్వాహకురాలు యస్‌వీ శివకుమారి ఇంటికి వెళ్లి భోజనం చేశారు. మరుసటి రోజు గుంటూరులో ఓ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నందున రెండో రోజు కూడా ఆయన ఒంగోలులోనే గడిపారు. విశ్వనాథ్ అంతటి విఖ్యాత దర్శకుడు తమ ఇంటికి రావడం అదృష్టం అని, ఆయన మృతిని జీర్ణించుకోలేక పోతున్నామని శివకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 2016లో ఆయనకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అక్కినేని కళాపరిషత్ నిర్వాహకులు కల్లంగుంట కృష్ణయ్య ఆధ్వర్యంలో స్వర్ణకంకణంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఒంగోలుకు వచ్చారు. ఆ సందర్భంగా నగరంలోని ముంగమూరు రోడ్డులో గూడ రామ్మోహన్ నిర్వహిస్తున్న శ్రీ ఆదిశంకరా వేద పాఠశాలను సందర్శించారు. అక్కడి వేద విద్యార్థులతో వేదాలు, బ్రాహ్మణత్వం గురించి చర్చించారు. వేద విద్యార్థులకు వస్త్రాలను బహూకరించారు. బ్రాహ్మణుడినై పుట్టి వేద విద్యను అభ్యసించలేక పోయాను అంటూ పండితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు రామ్మోహన్ గుర్తు చేసుకున్నారు. ఇలా ఒంగోలులోని కళాకారులతో, సంస్థలతో ఆయనకు అనుబంధం ఉంది. 'రాజు జీవించే రాతి విగ్రహము లందు, సుకవి జీవించే ప్రజల నాలుకల యందు' అన్న మహాకవి గుర్రం జాషువ వాక్యాలు విశ్వనాథ్ విషయంలో అక్షరాలా నిజమయ్యాయి.

ఒంగోలు ముంగమూరు రోడ్డులోని డాక్టర్ దారా రామయ్య శాస్త్రికి విశ్వనాథ్‌తో చిరకాల స్నేహం ఉందని ఆయన కూతురు, చిత్రకారిణి సి.హెచ్.శ్రీలక్ష్మి చెప్పారు. తాను గీసిన కృష్ణం వందే జగద్గురు చిత్రానికి వచ్చిన మిరాకిల్ బుక్ ఆఫ్ ఇండియా అవార్డు, తెలుగు బుక్ ఆఫ్ అవార్డులను విశ్వనాథ్ చేతుల మీదుగా తీసుకున్నానని చెప్పారు.



శ్రీనళిని ప్రియ నృత్య నికేతన్ వార్షికోత్సవంలో పాల్గొన్న మహా దర్శకుడు ( ఫైల్)

#### స్ఫూర్తినిచ్చిన విశ్వనాథ్ సినిమాలు

సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విశ్వనాథ్ సినిమాలను చూస్తూ పెరిగా. మానవ సంబంధాలు, నైతిక పునాదులపై ఆయన సినిమాలు చర్చించేవి. సమాజం పట్ల బాధ్యతను తెలిపే ఆ సినిమాల ప్రభావంతో విదేశాల్లో ఉద్యోగాన్ని వదిలి ఒంగోలులో నృత్య కళాశాలను ఏర్పాటు చేశా. ఎంతోమంది చిన్నారులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నా. మా కళాశాల ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ఒంగోలుకు రావడం, తండ్రిలా మా ఇంటికి భోజనం చేయడం ఎన్నటికీ మరిచిపోలేను. ఆయన మరణం కళాకారులకు తీరని లోటు.

– యస్‌వీ శివకుమారి,
శ్రీ నళిని ప్రియ కూచిపూడి నృత్య నికేతన్, ఒంగోలు

#### మళ్లీ పుట్టాలని కోరుకుంటున్నా

సినిమాలు చూస్తే పిల్లలు పాడైపోతారని పెద్దలు మందలించే వారు. అలాంటి పరిస్థితి నుంచి స్వయంగా పెద్దలే తమ పిల్లలను విశ్వనాథ్ సినిమాలు చూడమని ప్రోత్సాహించేలా ఆయన కళాఖండాలు రూపొందించారు. విశ్వనాథ్ మృతి తెలుగు సినిమా రంగానికే కాదు, తెలుగు ప్రజలందరికీ తీరని లోటు. ఆయన వారసత్వాన్ని కొనసాగించే దర్శకులు నేడు ఒక్కరు కూడా కనిపించకపోవడం విచారకరం.

– కల్లకుంట కృష్ణయ్య,
అక్కినేని కళాపరిషత్, ఒంగోలు

#### సంప్రదాయ సంకెళ్లు తెంచిన విశ్వనాథుడు

ఒంగోలు టౌన్: కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి రంగభూమి కళాకారుల సంఘం ఘనంగా నివాళి అర్పించింది. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. సామాజిక సందేశంతో నిర్మించిన ఆయన సినిమాలు తెలుగు ప్రజల సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాయని పడమటి గాలి ఫేం పాటిబండ్ల ఆనందరావు అన్నారు. సంప్రదాయ సంకెళ్లను తెంచిన సాంస్కృతిక విప్లవ కారుడు విశ్వనాథ్ మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి చెందిన కవులు, కళాకారులు ప్రసాద్, ఏ.ప్రసాద్, వాకా సంజీవరెడ్డి, గుర్రం కృష్ణ, తాళ్లూరి శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ, నల్లమల్లి పాండురంగనాథం, ఎస్కే బాబు, పొన్నూరి వెంకట శ్రీనివాసులు, కె.రాఘవులు తదితరులు విశ్వనాథ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అక్కినేని కళాపరిషత్ అధ్వర్యంలో స్వర్ణకంకణ సన్మాన కార్యక్రమంలో.. ( ఫైల్)



విశ్వనాథ్ నుంచి అవార్డు తీసుకుంటున్న శ్రీలక్ష్మి



విశ్వనాథ్‌కు నివాళి అర్పిస్తున్న రంగభూమి కళాకారులు

# పేదల విదేశీ విద్యకు ప్రభుత్వ దీవెన

- తొలి విడతలో ఐదుగురు విద్యార్థులకు రూ.38,93,250
- జగనన్న విదేశీ విద్యా దీవెనలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: ప్రతిభ ఉన్నా పేదరికంతో విదేశాల్లోని ప్రముఖ విద్యా సంస్థల్లో చదవలేని పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా అవకాశం కల్పిస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం 2022-23 సంత్సరానికి మొదటి విడత నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో సమావేశం ద్వారా నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం జిల్లాలోని లబ్ధిదారులైన విద్యార్థులకు బ్యాంకు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ టాప్-100 క్యుఎస్ ర్యాంక్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు, మిగిలిన వారికి రూ.1కోటి వరకు నూరు శాతం ట్యూషన్ ఫీజు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. టాప్ 101-200 క్యుఎస్ ర్యాంకులు పొందిన యూనివర్శిటీల్లో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.75 లక్షలు వరకు నూరుశాతం, మిగిలిన విద్యార్థులకు రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం ఏది తక్కువ అయితే దాన్ని చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పూర్తి పారదర్శకతతో పథకం అమలు చేస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. వారిలో ఒకరు ఎస్సీ, నలుగురు ఈబీసీ విద్యార్థులున్నట్లు తెలిపారు. తొలివిడతలో విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.38,93,250 ప్రభుత్వం జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న సహాయంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి మంజులాదేవి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, మైనార్టీ సంక్షేమ అధికారి ఝాన్సీ ఇతర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

#### ముఖ్యమంత్రి చేసిన మేలు మరిచిపోలేను



పొన్నలూరు మండలం రావుకొల్లు గ్రామంలో సాధారణ వ్యవసాయ పనులు చేసుకునే కుటుంబంలో ఉన్న నాకు విదేశీ విద్యను అభ్యసించేందుకు సహాయం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేలు ఎన్నటికీ మరువను. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ ఉన్నత విద్యను చదవలనే ఆశయం ఉన్నా ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదలేపోతున్న నాకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉండి వెన్నుదన్నుగా నిలవడం సంతోషాన్ని కలిగిస్తోంది. అమెరికాలోని న్యూయార్క్ యూనిర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివే అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– బెల్లం గిరిప్రసాద్, న్యూయార్క్ యూనివర్శిటీకి ఎంపికైన విద్యార్థి

# విహారయాత్రలో విషాదం

- లోయలో పడిన లారీ
- ఇద్దరు యువకుల మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



పి. నారాయణ రెడ్డి (ఫైల్)



జి. నాగసురేష్ (ఫైల్)

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మారేడుమిల్లి- చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపం వద్ద పన్నెండు టైర్ల లారీ మలుపులో అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నాలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి పౌరసరఫరాల బియ్యం లోడుతో లారీ చింతూరుకి వెళ్లి బియ్యం లోడు దింపి తిరిగి రాజమహేంద్రవరం వస్తోంది. అయితే ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు గురువారం పాపికొండలు విహార యాత్రకు వెళ్లారు. అనంతరం బస్సులో మారేడుమిల్లికి వచ్చారు. రాత్రి మారేడుమిల్లి క్యాపింట్ టెంట్ రిసార్ట్‌లో విడిది చేశారు. శుక్రవారం బస్సులో జలతరంగిణి జలపాతాన్ని సందర్శించి అక్కడి నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. తిరిగి మారేడుమిల్లి రావడానికి మార్గంలో వేచి చూస్తుండగా చింతూరులో బియ్యంలోడు దింపి తిరిగి అటువైపుగా వస్తున్న లారీని ఆపి ఆరుగురు ఎక్కారు. పాములేరు గ్రామ సమీపం వద్ద మలుపులో అదుపు తప్పి లారీ రోడ్డు పక్కనే ఉన్న చెట్లను ఢీకొని సుమారు 80 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పిచ్చెల నారాయణ రెడ్డి (32), జి.నాగసురేష్ (23) అక్కడికక్కడే మృతి చెందారు. నాగిరెడ్డి చెన్నారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, పెద్దసూరా సుబ్బారెడ్డితో పాటు డ్రైవర్ వెంకటేశ్వరస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు రాము, జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని లారీ, క్యాబ్ యానియన్ సభ్యులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. నాగ సురేష్ మృతదేహం లారీ ఎదుటి భాగం కింద మట్టిలో కూరుకుపోయింది. లోయలో పడిపోవడంతో వెలికితీత చర్యలు చేపట్టారు. మృతుడు పిచ్చెల నారాయణరెడ్డి ఒడిశా రాష్ట్రం రామ్‌రంగపూర్‌లో రైల్వే స్టేషన్‌లో టీసీగా పని చేస్తున్నాడు. నాగ సురేష్ ఎంసీఏ చదువుతున్నాడు.



సంఘటన స్థలంలో నారాయణరెడ్డి మృతదేహం



లోయలో పడిపోయిన లారీ



లారీ కింద మట్టిలో కురుకుపోయి మృతి చెందిన నాగ సురేష్ చెయ్యి మాత్రమే కనిపిస్తున్న దృశ్యం